
ఆంధ్రజ్యోతి
andhrajyothy.com గురువారం ఉష్ణోగ్రత గరిష్ఠం 28.7, కనిష్ఠం 18.3



15నుంచి ఒంటిపూట బడులు

నిజామాబాద్ అర్బన్, మార్చి 7: ఎండల తీవ్రత రోజురోజుకూ పెరుగుతుండడంతో ప్రభుత్వం ఈనెల 15 నుంచి పాఠశాలలకు ఒంటిపూట బడులను నిర్వహించాలని నిర్ణయించింది. ఈ నెల 15నుంచి ఏప్రిల్ 23వరకు ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు ఒంటిపూట బడులు నడపాలని విద్యాశాఖ ఆదేశాలు జారీ చేసింది. పదోతరగతి విద్యార్థులకు మాత్రం ప్రత్యేక తరగతులు యథావిధిగా కొనసాగుతాయని, పరీక్షలు జరిగే పాఠశాలల్లో మధ్యాహ్నం 1గంట నుంచి 5గంటల వరకు తరగతులను కొనసాగించాలని ఆదేశించింది.

శంభో శివ శంభో

- నేడే మహా శివరాత్రి
- ఉపవాసాలు, జాగరణలతో మహాశివుడిని కొలిచేందుకు సిద్ధమైన భక్తులు
- జిల్లా వ్యాప్తంగా ముస్తాబైన శివాలయాలు
- ప్రత్యేక ఏర్పాట్లు చేసిన ఆలయ కమిటీలు
- పూలు, పండ్లు, పూజ సామగ్రికి పెరిగిన గిరాకీ
- జిల్లా అంతటా శివరాత్రి సందడి

మహాశివుడిని కొలిచేందుకు జిల్లా ప్రజలు సిద్ధమయ్యారు. శుక్రవారం మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని ఉపవాసాలు, జాగరణలతో భోళాశంకరుడి కృపను పొందేందుకు భక్తులు సర్వం సిద్ధం చేశారు. ఈ మేరకు జిల్లా వ్యాప్తంగా శివాలయాలన్నీ ముస్తాబయ్యాయి. భక్తుల సౌకర్యార్థం ఆలయ కమిటీలు అన్ని ఏర్పాట్లు చేశాయి. జిల్లా వ్యాప్తంగా పూలు, పండ్ల వ్యాపార సముదాయాలు సందడిగా మారాయి.







• విద్యుత్ కాంతుల్లో నగరంలోని కంఠేశ్వర ఆలయం










బాలరాజరాజేశ్వర స్వామి ఆలయంలోని శివలింగం






• ఉప్లూర్ బాలరాజరాజేశ్వర స్వామి ఆలయం



ముప్కాల్‌లోని కొత్తపల్లి శివాలయం



ఆర్మూర్‌లోని సిద్ధులగుట్టపై శివాలయం



సిద్ధులగుట్ట శివాలయంలోని సిద్ధేశ్వరుడు



బోధన్ చక్రేశ్వరాలయం లోని శివలింగం





• నగరంలోని మార్కెట్‌లో పూలు, పండ్లు, పూజా సామగ్రిని కొనుగోలు చేస్తున్న భక్తులు



• ముస్తాబైన బోధన్ చక్రేశ్వరాలయం



రైస్‌మిల్లుల్లో కొనసాగుతున్న తనిఖీలు

- ధాన్యం నిల్వలు లేని మరికొన్ని మిల్లులపై చర్యలకు సిద్ధమవుతున్న యంత్రాంగం
- తనిఖీలను ఆపేందుకు ఒత్తిళ్లు పెంచుతున్న కొంతమంది మిల్లర్లు


నిజామాబాద్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాలో బియ్యం ఎఫ్‌సీఐకి అందించని మిల్లుల యజమానులపై చర్యలకు అధికారులు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే కొన్ని మిల్లులపై కేసులు నమోదు చేసిన అధికారులు మరికొన్ని మిల్లుల్లో తనిఖీలు కొనసాగిస్తున్నారు. ధాన్యం కేటాయింపులకు అనుగుణంగా నిల్వలు లేని మరికొన్ని మిల్లులపై కేసులు పెట్టడంతో పాటు వసూలు చేసేందుకు ఆర్ఆర్ యాక్టు కింద చర్యలకు సిద్ధమవుతున్నారు. కొంతమంది మిల్లుల యజమానులు అధికారులపై ఒత్తిడి తెస్తున్నా ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా ఈ తనిఖీలను కొనసాగిస్తున్నారు. నిర్ణీత సమయంలో బియ్యం ఎఫ్‌సీఐకి అందించని మిల్లులన్నింటిపై కేసులు నమోదు చేసేందుకు సిద్ధమవుతున్నారు.

కెపాసిటీ ఆధారంగా ధాన్యం కేటాయింపు

జిల్లాలో గడిచిన కొన్నేళ్లుగా ప్రాథమిక వ్యవసాయ సంఘాలతో పాటు ఇతర సంఘాల ద్వారా ధాన్యం కొనుగోలు చేస్తున్నారు. ఈ ధాన్యాన్ని జిల్లాల్లోని రైస్ మిల్లులకు వాటి కెపాసిటీ ఆధారంగా కేటాయిస్తున్నారు. వానాకాలం, యాసంగి సీజన్ల వారీగా ధాన్యం ఇవ్వడంతో పాటు నిర్ణీత సమయంలో బియ్యాన్ని ఎఫ్‌సీఐకి అందించే విధంగా అధికారులు చర్యలు తీసుకున్నారు. గత ప్రభుత్వ హాయంలో కొంతమంది మిల్లర్లు 2021-22, 2022-23 సంవత్సరాలకు సంబంధించిన ధాన్యానికి తగ్గట్టుగా బియ్యాన్ని ఎఫ్‌సీఐకి కేటాయించ లేదు. సీజన్ దాటి పోయినా ఇవ్వలేదు. మిగతా సీజన్ల ధాన్యం తీసుకుని వాటి కేటాయింపులను చేశారు. కొంతమంది మిల్లర్లు బయట డిమాండ్ ఉండడంతో బియ్యాన్ని అమ్ముకున్నారు. ప్రభుత్వం మారి కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడగానే రాష్ట్ర వ్యాప్తంగా మిల్లర్ల దందాపై నజర్ పెట్టారు.

జిల్లాలో 11మిల్లుల్లో తనిఖీలను పూర్తి

జిల్లాలో గడిచిన నెలలుగా తనిఖీలను చేస్తున్నారు. ఇప్పటికే జిల్లాలో 11మిల్లుల్లో తనిఖీలను పూర్తిచేశారు. ఈ మిల్లుల్లో సుమారు 155కోట్లకు పైగా ధాన్యం పక్కదారి పట్టినట్లు గుర్తించారు. ఈ మిల్లుల యజమానులపైన కేసులు నమోదు చేయడంతో పాటు ఆర్ఆర్ యాక్టు కింద చర్యలకు సిద్ధమయ్యారు. ధాన్యం లేకపోవడంతో పాటు బియ్యాన్ని ఎఫ్‌సీఐకి అందించక పోవడం వల్ల ప్రభుత్వం సీరియస్ కావడంతో వారి నుంచి వసూలు చేసేందుకు సిద్ధమవుతున్నారు. వర్నీ, బోధన్ మండలం పరిధిలోని మరికొన్ని మిల్లుల్లో ఈ తనిఖీలను కొనసాగిస్తున్నారు. ఈ మిల్లుల్లో కూడా కోట్ల రూపాయల విలువైన ధాన్యం లేనట్లు అధికారులు గుర్తించారు. వీటిపైన కూడా కేసులు నమోదు చేసేందుకు సిద్ధమవుతున్నారు. అయితే కొంతమంది మిల్లర్లు ప్రజాప్రతినిధులను కలుస్తూ తనిఖీల నుంచి బయటపడేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. మరికొంతమంది మిల్లర్లు అధికారులను టార్గెట్ చేస్తున్నారు. చూసీచూడనట్లు పోవాలని ఒత్తిళ్లను పెంచుతున్నారు. ధాన్యం వ్యవహారంపై ప్రభుత్వంతో పాటు మంత్రులు కూడా సీరియస్‌గా ఉండడంతో జిల్లా అధికారులు వెనకడుగు వేయడం లేదు.



పార్లమెంట్ ఎన్నికలకు అధికారుల కసరత్తు

- ముందస్తు ఏర్పాట్లలో జిల్లా అధికారుల నిమగ్నం
- పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతుల ఏర్పాట్లు
- పార్లమెంట్ పరిధిలో 18లక్షల 85వేల 651మంది ఓటర్లు

నిజామాబాద్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): పార్లమెంట్ ఎన్నికల కోసం జిల్లా యంత్రాంగం కసరత్తు చేస్తోంది. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు గత నెలలోనే ఓటరు జాబితాను ప్రకటించిన అధికారులు ఈవీఎంల ఏర్పాటును పూర్తి చేశారు. పార్లమెంట్ పరిధిలోని ఏడు నియోజకవర్గాల్లో పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఎన్నికల షెడ్యూల్ రాగానే నిర్వహించే విధంగా ఏర్పాట్లను చేస్తున్నారు. అన్ని పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులను కల్పించడంతో పాటు పోలింగ్ తర్వాత ఈవీఎంలను భద్రపరిచి కౌంటింగ్ చేసేందుకు కేంద్రాలను కూడా ఏర్పాటు చేశారు. ఈ ఎన్నికలకు కావాల్సిన ఏర్పాట్లను చేయడంతో పాటు ఉద్యోగులను కావాల్సిన శిక్షణను అందించేందుకు సిద్ధమవుతున్నారు. పార్లమెంట్ పరిధిలో సమస్యాత్మక, అతి సమస్యాత్మక కేంద్రాలను గుర్తించి ఎన్నికల కమిషన్‌కు ముందే నివేదించారు. ఈ ఎన్నికలకు ఎంతమొత్తం భద్రత సిబ్బంది అవసరమో వివరాలను పంపించి ఇతర ఏర్పాట్లలో అధికారులు నిమగ్నమయ్యారు.

త్వరలో ఎన్నికల షెడ్యూల్

పార్లమెంట్ ఎన్నికల షెడ్యూల్ వచ్చే వారంలో రానుంది. ఈనెల 14లేదా 15న షెడ్యూల్ రానుండడంతో ముందస్తుగానే అధికారులు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. పార్లమెంట్ పరిధిలో మొత్తం ఏడు నియోజకవర్గాలు ఉన్నాయి. వీటిలో నిజామాబాద్ జిల్లా పరిధిలో నిజామాబాద్ అర్బన్, నిజామాబాద్ రూరల్, బోధన్, ఆర్మూర్, బాల్కొండ ఉండగా జగిత్యాల జిల్లా పరిధిలో కోరుట్ల, జగిత్యాల నియోజకవర్గాలు ఉన్నాయి. వీటి పరిధిలో మొత్తం ఓటర్ లీస్టు జాబితాను గత నెల 8నే ప్రకటించారు. పోలింగ్ కేంద్రాలను గుర్తించారు. శాసనసభ ఎన్నికలకు ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలనే ఈ ఎన్నికలకు కూడా వినియోగించనున్నారు. అవసరమైన కేంద్రాల్లో పూర్తిస్థాయిలో మౌళిక వసతుల ను కల్పించేందుకు సిద్ధమవుతున్నారు. పార్లమెంట్ పరిధిలో మొత్తం 18లక్షల 85వేల 651మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో పురుష ఓటర్లు 8,92,634 మంది ఉండగా మహిళా ఓటర్లు 9,92,826 మంది ఉన్నారు. వీరితో పాటు థర్డ్ జెండర్ 91మంది ఉన్నారు. వీరి లీస్టు తయారు చేడయంతో పాటు పార్లమెంట్ పరిధిలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాట్లను చేస్తున్నారు. ఈ పార్లమెంట్ పరిధిలో రెండు జిల్లాలు ఉండడం వల్ల ఇప్పటికే జిల్లా కలెక్టర్ పలు దఫాలు ఈ ఎన్నికలపై సమీక్షించారు. ఎన్నికలకు కావాల్సిన ఈవీఎంలను సరిచూశారు. రాజకీయ పార్టీల నేతల సమక్షంలో వాటిని తనిఖీ చేశారు. ఎన్నికలకు అవసరమైన విధంగా ఏర్పాట్లను కమిషన్ ఆదేశాల మేరకుపూర్తిచేశారు. ఈనెల రెండో వారంలోనే షెడ్యూల్ రానుండడంతో ముందస్తు ఏర్పాట్లన్నీ పూర్తిచేశారు. షెడ్యూల్ రాగానే ఏడు నియోజకవర్గాల పరిధిలో సిబ్బందిని గుర్తించి పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించిన శిక్షణ ఇవ్వనున్నారు. పార్లమెం ట్ పరిధిలోని ఏడు శాసనసభ నియోజ కవర్గాల్లో అసిస్టెంట్ ఎన్నికల అధికారులను, జోనల్ అధికారులను, సెక్టోరియల్ అధికారులను నియమించనున్నారు. వీరితోపాటు భద్రత సిబ్బందికి అవసరమైన ఏర్పాట్లను చేస్తున్నారు. ఈ పార్లమెంట్ పరిధిలో సమస్యాత్మక, అతి సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించి ఎన్నికల కమిషన్‌కు నివేదించారు. కమిషన్ ఆదేశాల మేరకు ఆ కేంద్రాల్లో భద్రత పెంచడంతో పాటు సీసీ కెమెరాల ఏర్పాట్లను చేయనున్నారు. సీసీ కెమెరాల ద్వారా పర్యవేక్షించనున్నారు.

బ్యాలెట్ బాక్సుల భద్రతకు ఏర్పాట్లు

పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ జరగగానే ఆ బ్యాలెట్ బాక్సులను భద్ర పరిచేందుకు ఏర్పాట్లచేశారు. డిచ్‌పల్లిలోని జాతీయ రహదారి పక్కనే ఉన్న సీఎంసీ భవనంలో భద్ర పరిచేందుకు నిర్ణయించారు. ఈ భవనంలోనే 2014, 2019 పార్లమెంట్ ఎన్నికల బాక్సులను భద్ర పర్చడం వల్ల ఈ ఎన్నికలకు కూడా ఆభవనాన్నే తీసుకున్నారు. ఈ భవనంలో భద్రతకు కావాల్సిన అన్ని ఏర్పాట్లను చేస్తున్నారు. జాతీయ రహదారి వెంబడి ఉండడం, సెక్యూరిటీకి తగిన విధంగా ఉండడం వల్ల ఈ నిర్ణయం తీసుకున్నారు. కలెక్టర్‌తోపాటు నగర పోలీస్ కమిషనర్, ఇతర అధికారులు పలుదఫాలు పరిశీలించి ఎన్నికల కమిషన్‌కు నివేదించి అనుమతులను తీసుకున్నారు.





రమాదేవితో మండవ వెంకటేశ్వర్‌రావు, పార్టీ నేతలు

హైదరాబాద్‌లో తుమ్మల సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన రమాదేవి

కాంగ్రెస్‌లోకి అట్లూరి రమాదేవి

- పార్టీ కండువా కప్పి ఆహ్వానించిన మంత్రి తుమ్మల, మాజీ మంత్రి మండవ
- బాన్సువాడ నియోజకవర్గంలో పెరగనున్న కాంగ్రెస్ పార్టీ బలం

నిజామాబాద్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాకు చెందిన బీఆర్ఎస్ మహిళా నాయకురాలు అట్లూరి రమాదేవి గురువారం కాంగ్రెస్‌లో చేరారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు, మాజీ మంత్రి మండవ వెంకటేశ్వర్ రావు సమక్షంలో.. హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో కాంగ్రెస్‌లో చేరారు. అట్లూరి రమాదేవి సుదీర్ఘకాలంగా తెలుగుదేశంలో పని చేశారు. 2018లో బీఆర్ఎస్‌లో చేరి కొంతకాలం స్తబ్దుగా ఉండిపోయారు. సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉన్న రమాదేవి అనేక అభివృద్ధి, సేవ కార్యక్రమాలలో పాల్గొన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో రాష్ట్ర మహిళా ఆర్థిక సంస్థ చైర్మన్, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలిగా, నిజామాబాద్ అధ్యక్షురాలిగా వివిధ హోదాల్లో పని చేశారు. బోధన్‌లో ఓ ప్రైవేటు పాఠశాలను స్థాపించి 14 ఏళ్లుగా విద్యార్థులకు విద్యనందించారు. ఉమ్మడి రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి ఎన్‌టీ రామారావు వద్ద మంచి పేరు, ప్రఖ్యాతలు సంపాదించించారు. సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉన్న ఆమె ప్రజా సేవ కోసం కాంగ్రెస్‌లో చేరడంతో.. బాన్సువాడ నియోజకవర్గానికి మంచి పట్టు వచ్చే అవకాశం ఉంది. కాగా.. రమాదేవి స్వస్థలం బాన్సువాడ నియోజకవర్గంలోని వర్ని మండలం శ్రీనగర్ గ్రామం. తండ్రి పాములపాటి శ్రీమన్నారాయణ బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతిగా పేరుగాంచారు. తండ్రిని ఆదర్శంగా తీసుకుని ఆమె రాజకీయ రంగంలో ప్రవేశించారు. మూడుసార్లు బాన్సువాడ ఎమ్మెల్యేగా టికెట్ వచ్చిందని పేర్కొన్నారు. అట్లూరి రమాదేవి కాంగ్రెస్ పార్టీలో చేరడంతో బాన్సువాడ నియోజకవర్గానికి కాంగ్రెస్ పార్టీకి గట్టి బలం వచ్చినట్లయింది. కార్యక్రమంలో బాన్సువాడ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ఏనుగు రవీందర్ రెడ్డి, కమ్మ సత్యనారాయణలతో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి

పేదలకు అండగా కాంగ్రెస్ పార్టీ

● నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతి రెడ్డి

నిజామాబాద్ రూరల్, మార్చి 7 : కాంగ్రెస్ పార్టీ పేదలకు అండగా ఉంటుందని, అన్ని వర్గాల ప్రజల సంక్షేమం కోసం పని చేస్తోందని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే ఆర్.భూపతిరెడ్డి అన్నారు. గురువారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో రూరల్ పరిధిలోని గ్రామాలకు చెందిన 308మంది లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. అనంతరం ఎమ్మెల్యే భూపతిరెడ్డి మాట్లాడుతూ.. సంక్షేమ పథకాల అమలులో కాంగ్రెస్ పార్టీ తమ తర బేదాలు చూడదన్నారు. బీఆర్ఎస్ పార్టీ హయాంలో సంక్షేమపథకాలు అన్నీ ఆ పార్టీ కార్యకర్తలు, అనుచరులకే ఇచ్చుకున్నారని విమర్శించారు. 308 కళ్యాణ లక్ష్మి, షాదీముబారక్ చెక్కులు ఎమ్మెల్యే పంపిణీచేశారు. ప్రజల ఆశీర్వాదంతో తెలంగాణలో ఇందిరమ్మ రాజ్యం వచ్చిందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే కరెంట్ రాదు, కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు రావని బీఆర్ఎస్ చేసిన అసత్య ప్రచారాలు చేసినా.. ప్రజలు నమ్మలేదన్నారు. ఆరు గ్యారంటీలను కూడా సీఎం రేవంత్ రెడ్డి తప్పకుండా అమలు చేసితీరుతారని ఎమ్మెల్యే బరోసా ఇచ్చారు. జీరో కరెంట్ బిల్లు అమలు కూడా ప్రారంభమైందని 200 యూనిట్ల లోపు వారికి కరెంట్ బిల్లు కట్టేఅవసరం లేదని అన్నారు.

ఇందిరమ్మ పాలనలోనే పేదలకు న్యాయం :ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి

ధర్పల్లి: ఇందిరమ్మపాలనలో పేదలకు లబ్ధిచేకూరుతుందని నిజామాబాద్‌రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలో ధర్పల్లి, సిరికొండ, ఇందల్వాయి మండలాలకు చెందని 308మంది లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మీ, షాదిముబారక్ చెక్కులను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అర్హులైన లబ్ధిదా రులందరికి సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. గృహజ్యోతి, గృహ లక్ష్మీ పథకాలు లబ్ధిదారులకు అందాయని ఆయన పేర్కొన్నారు. త్వరలోనే రైతులకు రుణమాఫీ, ఇందిరమమ ఇళ్ల పథకాలు సీఎం ప్రారంభిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సారిక హన్మంత్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఆర్మూర్ చిన్న బాల్‌రాజ్, చెలిమెల శ్రీనివాస్, పుప్పాల సుభాష్, లచ్చర్ల గంగారాం, ఆనంద్, కుమ్మరి గొండన్న, అబ్దుల్‌అమీద్, ఆయా గ్రామాల అధికారుల, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఆదర్శ పాఠశాలలో సైన్స్ ఎగ్జిబిషన్ ప్రదర్శన

జక్రాన్‌పల్లి, మార్చి7: జక్రాన్‌పల్లి మండలంలోని ఆదర్శ పాఠశాల కళాశాలలో గురువారం సైన్స్ ఎగ్జిబిషన్ ప్రదర్శన నిర్వహించారు. విద్యార్థులు ప్రదర్శించిన వివిధ నమూనాలను తెలంగాణ యూనివర్సిటీ ప్రత్యేక అధికారి మహేందర్ అభినందించారు. విద్యార్థులు ప్రదర్శించిన నమూనాలను తిలకించి విద్యార్థులకు సైన్స్ పట్ల శాస్త్రీయ పరిశోధన పట్ల పవర్ సహాయంతో ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో శ్రీనివాస్, జక్రాన్‌పల్లి, డిచ్‌పల్లి ప్రిన్సిపాల్‌లు రాజేశ్వర్‌రెడ్డి, గణేష్, ప్రధానోపాధ్యాయుడు లింగన్న, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మహా శివరాత్రి ఉత్సవాలకు ముస్తాబైన శైవక్షేత్రాలు



నగరంలో శంభులింగేశ్వరాలయం




నందిపేటలోని నందికేశ్వర ఆలయం



ఆర్మూర్‌లో సిద్ధులగుట్టపై కోనేరు



ముస్తాబైన పడిలేచిన మర్రిచెట్టు దేవస్థానం



లొంకరామలింగేశ్వర స్వామి ఆలయం

నిజామాబాద్‌అర్బన్,మార్చి 7 : మహాశివరాత్రి వేడుకలకు జిల్లాలోని శివాలయాలన్నీ ముస్తాబయ్యాయి. మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని భక్తుల కోసం శివాలయాల వద్ద అన్ని ఏర్పాట్లు చేశారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా ఉండేందుకు అన్ని చర్యలు తీసుకున్నారు. జిల్లాలలోని ప్రసిద్ధ శివాలయాలన్ని శివరాత్రి సందర్భంగా విశేష పూజలు, అభిషేకాలు చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లా కేంద్రంలోని నీలకంఠేశ్వరాలయం, శంభులింగేశ్వరాలయం, నందిగుట్ట శివాలయం, ఉమామహేశ్వర ఆలయాలు, లింగేశ్వరగుట్ట శివాలయం, తదితర ఆలయాలు శివరాత్రి వేళ ఉత్సవాలకు సిద్ధమయ్యాయి.

● నీలకంఠాభరణం..నీలకంఠేశ్వరాలయం...

జిల్లా కేంద్రంలోని కంఠేశ్వర్ ప్రాంతంలో శివలింగం స్వయంభుగా వెలసిన శివాలయమే నేటి నీలకంఠేశ్వరాలయంగా ప్రసిద్ధి చెందింది. ఒకటోవ శతాబ్దంలో జైనుల కోసం శాతవాహన రాజు శాతకర్ణి-2 ఈ ఆలయాన్ని నిర్మించినట్లు తెలుస్తోంది.ఈఆలయ నిర్మాణం ఉత్తర భారతీయ నిర్మాణశైలిని కలిగి ఉంటుంది. అతి పురాతనమైన ఈ ఆల యం త్రిమూర్తులు వెలిసిన అరుదైన పుణ్యక్షేత్రంగా చెప్పవచ్చు. ఈ దేవాలయం నాడు నిజాంవ్యతిరేక పోరాటంలో రజాకార్లపై తిరుగు బాటు చేసిన స్థానికఉద్యమకారులకు రహస్యస్థావరంగా నిలచినట్లు తెలుస్తోంది.

● శంబులింగేశ్వరాలయం

నగరంలోని నెహ్రూపార్క్ సమీపంలో అతి పురాతనమైన శంబులింగేశ్వరాలయం ఉంది. తేత్రాయుగంలో ఈస్వయంబు శంబులింగేశ్వరాలయం వెలిసినట్లు పురాణాలు చెబుతున్నాయి. ఈ ఆలయంలో వసంతపంచమి సందర్భంగా విశేషపూజలు చేయడంతో పాటు భక్తుల కోరికలు తీర్చే కొంగుబంగారంగా ఈఆలయం ప్రసిద్ధిగాంచింది.

● నందిగుట్ట ఆలయం

నగరంలోని నాగారంలో గల గుట్టపై నందిగుట్ట శివాలయం ఉంది. శివరాత్రి సందర్భంగా ఇక్కడ ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తారు. 750ఏళ్ల క్రితం ఈ ఆలయం వెలిసినట్లుగా తెలుస్తోంది.

నందిపేట: మండలంలోని వివిధ గ్రామాలలో ఉన్న శివాలయాలు శివరాత్రి ఉత్సవాలకు ముస్తాభైనాయి. మండల కేంద్రంలోని శ్రీ కేదారేశ్వర ఆశ్రమం, నందికేశ్వర ఆలయం, ఉమ్మెడ పాత గ్రామంలోని శ్రీ ఉమా మహేశ్వర ఆలయాలు ఉత్సవాలకు రూపుదిద్దుకున్నాయి. నిర్వహకులు ఏర్పాటు చేశారు. జాతరకు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నారు. పెద్ద మొత్తంలో అన్నదానం కార్యక్రమాలు ఏర్పాటు చేయడానికి సన్నాహలు చేస్తున్నారు. శివాలయాల వరకు భక్తులకు రవాణ సౌకర్యం కల్పించడానికి కొందరు ట్రాక్టర్లు సమకూర్చగా, కొందరు ప్రైవేట్ పాఠశాలల యజమానులు బస్సులను ఉపయోగిస్తున్నారు.

బోధన్‌రూరల్: బోధన్ పట్టణంలోని ప్రసిద్ధ ఏకచక్రేశ్వ రాల యం మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు ముస్తాబైంది. శుక్రవారం మహాశివరాత్రి పర్వ దిన వేడుకలకు అన్ని ఏర్పాట్లు ఆలయ కమిటీ పూర్తి చేసింది. 8వ తేది శుక్ర వారం కొనసాగనున్న మహాశివరాత్రి వేడుకలకు శివాలయాన్ని సుంద రంగా ముస్తాబు చేశారు. ఆలయం లో తెల్లవారు జాము నుంచి అర్ధరాత్రి వరకు ప్ర త్యేక పూజా కార్యక్రమాలు కొనసాగనున్నాయి. శుక్రవారం తెల్లవారు జామున 4 గంటల నుంచి 5 గంటల వరకు గర్భాలయ ధర్మదర్శనం, ఉదయం 5 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు అభిషేకాలు, రాత్రి 9 గంట లకు స్వామి వారి కల్యాణం మహోత్సవ వేడుకలు కొనసాగను న్నా యి. రాత్రి 12 గం టలకు స్వామి వారికి నిశిపూజ కార్యక్రమాలు నిర్వ హించనున్నారు. శనివారం ఉత్సవాలలో రెండవ రోజు మధ్యాహ్నం 3 గంటలకు రథోత్సవ ఊరేగింపు కార్యక్రమాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. విద్యుత్ దీపాలతో శివాల యం కాంతులీలుతుంది. రెండురోజుల పాటు ఆలయ ప్రాంగణంలో జాతర కొనసాగుతుంది. భక్తులకు కావాల్సిన అన్ని సౌక ర్యాలను కల్పించారు. తాగునీటి వసతి, విద్యుత్, విద్య సదుపాయాలను కల్పిం చారు.

● ఆలయ నేపథ్యం

శాండిల్య మహర్షి తన శిష్యులతో ఈ దేవాలయంలో వేదఘోష జరిపేవారని శివలీలామృతం అనే గ్రంథం చెబుతోంది. కాకతీయుల పరిపాలన కాలంలో ముష్కరులు దక్షిణ దేశ దండయాత్రకు పూనుకోవడం వలన అతి సుందరమైన ఈ దేవాలయాన్ని ముష్కరుల బారి నుంచి కాపాడటానికి భూస్థాపితం చేశారని గ్రంథంలో పేర్కొ న్నారు. గుంటూరు వాస్తవ్యుడు రామిరెడ్డి బోధన్‌లో స్థిరపడటానికి ఒక మట్టికోటను చదును చేస్తుండగా 07-02.1959న ఈ అపురూప దేవాలయం బయల్పడింది. దేవాలయంలో పుష్య బహుళ అమావాస్య రోజుననే బయల్పడటంతో స్వామి వారి మహత్యం సాక్షత్కారమవుతుంది. దీంతో ఆలయాన్ని బహుసుందరంగా నిర్మించారు. అప్పటి నుంచి ఈ ఆలయం భక్తుల పాలిట కొంగు బంగారంగా నిలుస్తోంది. బోధన్ పరిసర ప్రాంతాల నుండే కాక మహారాష్ట్ర, కర్నాటక భక్తులకు కూడా కొంగు బంగారమై నిత్య ఆరాధ్య దైవమై విలసిల్లుతుంది.

● మహాశివరాత్రి ఉత్సవాలకు ప్రత్యేక ఏర్పాట్లు

మహాశివరాత్రి ఉత్సవాల నేపథ్యంలో భక్తులు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా మహాశివరాత్రి ఉత్సవ కమిటీ అధ్యక్షుడు కన్నె హనుమంతరావు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నామని ఈ సందర్భంగా పేర్కొన్నారు. నీటి సౌకర్యం, వైద్య సౌకర్యాన్ని ఏర్పాటు చేశామన్నారు. జాతరలో ముందుగానే దుకాణాల ఏర్పాటు కోసం స్థలకేటాయింపుల పె ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. దేవాలయ పరిసరాలలో మత్తు పదా ర్థాల అమ్మకాలు, జూదంఆటకు నిషేధాజ్ఞ విధించారు. మున్సిపాలిటీ పోలీసుల శాఖ నుంచి ప్రత్యేక చర్యలకు, ఏర్పాట్లకు అనుమతులు కోరారు.

పెర్కిట్: ఆర్మూర్ పట్టణంలోని నవనాథ సిద్దులగుట్టపై ఆలయ ఉత్సవాల కమిటీ ఆధ్వర్యంలో మహాశివరాత్రిని పురస్కరించుకొని ఏర్పాట్లు పూర్తి అయ్యాయి. శుక్రవారం శివరాత్రి సందర్భంగా ఆర్మూర్ పట్టణ చుట్టు పక్కల గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో వచ్చేసి సిద్దేశ్వరునికి దర్శనం చేసుకుంటారు.

● భక్తులు కోరిన కోర్కెలు తీర్చే శ్రీ రామలింగేశ్వర స్వామి

సిరికొండ:మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని మూడు రోజుల పాటు శ్రీలొంక రామలింగేశ్వర స్వామి జాతర నేటి నుండి ఆదివారం వరకు జరుగుతుంది.ఆలాయ కమిటి సభ్యులు జాతర కోసం అన్ని ఏర్పాట్లు చేశారు.సిరికొండ మండల కేంద్రానికి ఎనిమిది కిలోమీటర్ల దూరాన దట్టమైన అడవీలో వెలిసిన శ్రీ లొంక రామలింగేశ్వర స్వామి ఉత్సవాలు శుక్రవారం మొదలై ఆదివారం వరకు జరుగుతాయి.శ్రీ లొంక రామలింగేశ్వర స్వామి భక్తులు కోరిన కోరికలు

మెండోర: ఉత్తర తెలంగాణలో రెండవ కాశీగా చెందిన హరిహర సుతుడు సీతరామ లక్ష్మణ సహితుడు కొలువైన క్షేత్రం పోచంపాడ్ గ్రామం. పవిత్ర గౌతమి నది తీరాన వెలిసిన శివాలయం శ్రీ కొదండ రామాలయం పోచంపాడ్ గ్రామానికి వన్నె తెచ్చాయి. ఎంతో ప్రాశ స్త్యం కలిగిన శివాలయంలో మహాశివరాత్రి ఉత్సవాలకు అంగరం గా వైభవంగా నిర్వహిస్తారు. శ్రీరాముడు వనవాసం సమయంలో ఈ ప్రాంతంలో సంచరించడంతో ఈప్రాంతం శ్రీరామునిపాదస్పర్శతో పుణితం అయిందని భక్తులు ప్రగాఢ విశ్వాసం. పురాణాల ప్రకారం శివాలయం విశిష్టత ఈ విధంగా ఉంది. తండ్రికి ఇచ్చిన మాట కోసం శ్రీరాముడు 14ఏళ్ల వనవాసం సమయంలో గోదావరి నంది వెంబడి సంచరించినట్టు ఇక్కడిఅనవాళ్లు తెలుపుతున్నాయి.శ్రీరాముడు వనవా సం చేస్తున్న సమయంలో కుస్తాపురం (ప్రస్తుతం శ్రీరాంసాగర్ ప్రాజె క్టు నిర్మాణంలో మునిగిపోయింది) గ్రామంలో గోదావరి నది చేరుకో గానే వశిష్ఠ మహర్షి సూచన మేరకు బ్రహ్మహత్యపాపా వి ముక్తి కోసం శ్రీరాముడిని కాశిలోనుంచి సువర్ణలింగాన్ని తెచ్చి పూజించాలి సూచిస్తారు.ప్రస్తుతం ఎస్సారెస్పీలో మునిపో యింది. శివాలయంలో నందీశ్వర విగ్రహాన్ని సైతం ఏర్పాటు చేయించారు.

● సాలగ్రామ నందీశ్వరుడు

పోచంపాడ్‌లోని ఆలయంలో కొలువైన నందీసాల గ్రామం నందీశ్వరుడు కావడంతో ఆలయం మరింత ప్రాధానయం సంచరించుకుంది. నందీశ్వరునికి సంబంధించిన ప్రాశస్త్యం ఇలా ఉంది. శ్రీఆముడు ప్రతిష్టించిన సైకత లిం గాన్ని తీసుకువచ్చి ప్రతిష్టించాలని చూడగా సాధ్యం కాకపోవడం తో కాశీ నుంచి శివలింగాన్ని తెప్పించి హంసి విరూపాక్ష నరసింహ భా రతిస్వామి చేతుల మీదుగా ప్రతిష్టించారు. నందీశ్వరుని కుసత పురం గ్రామం నుంచి తీసుకువచ్చి ప్రస్తుత శివాలయం ప్రతిష్టిం చారు. ఆ నందిని సాలగ్రామ నందీశ్వరునిగా ఇప్పటికి మనం చూడవచ్చు.

శివరాత్రికి ఏర్పాట్లు పూర్తి : సాగర్‌రెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్

మహాశివరాత్రి ఉత్సవాల్లో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. భక్తుల సౌకర్యార్థః కోసం ఆలయ ప్రాంగణంలో ఏర్పాట్లను చేశాం. జాగరణ కోసం వచ్చే భక్తులకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. ఉత్సవాలకు అంగరంగా వైభవంగా నిర్వహణకు ఏర్పాట్లు పూర్తయ్యాయి.

ముప్కాల్: మండల కేంద్రంలోని పడిలేచిన మర్రిచెట్టు దేవస్థానం వద్ద కొత్తపల్లి గ్రామంలోని రాజరాజేశ్వరస్వామి ఆలయంలో మహాశివరాత్రి ఉత్సవాలకు ఆలయ పూజరులు బుధవారం మూడు రోజులు జరిగే ఈ ఉత్సవాల్లో భాగంగా ఉదయం స్వస్తి వచనం నిర్వహిం చారు. అనంతరం నవగ్రహ స్థాపన, అగ్ని ప్రతిష్ఠా హోమం, రుత్విక్ వరుణం, రుద్రహోమం, తీర్థప్రసాద వితరణ చేశారు. భక్తుల సౌకర్యార్థం అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్టు గ్రామాభివృద్ధి కమిటీ, ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

'పోలీసు అధికారులను బెదిరించడం ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డికి తగదు'



మోర్తాడ్‌లో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

మోర్తాడ్, మార్చి7: బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి తన తమ్ముడికిగా చెప్పుకుంటున్న ఒడ్యాట్‌కు చెందిన గందం మహిపాల్ వల్ల ఓ గృహిణి ఆత్మహత్య చేసుకుంటే కుటుంబసభ్యులను పరామర్శించింది పోయి ఆత్మహత్యకు పిలుపునిచ్చిన మహిపాల్‌కు వంతుపాడుతూ పోలీస్ అధికారులను బెదిరించడం సమంజసం కాదని మోర్తాడ్, కమ్మర్‌పల్లి మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ముత్యాల రాములు, సుంకెట రవి ఆరోపించారు. గురువారం మండల కేంద్రంలోని ప్రజాభవన్‌లో వారు మాట్లాడారు. హంతకులను కాపాడిన చరిత్ర, అమాయకులను కేసులో ఇరికించిన ఘనత, రైతులపై తప్పుడు కేసులు పెట్టిన చరిత్ర ప్రశాంత్‌రెడ్డిది అని అన్నారు. ఒడ్యాట్‌కు చెం దిన మహిళ మరణ వాంగ్మూలం నిందితులను పోలీసులు అరెస్టు చేశారని వారన్నారు. దీంతో భీమ్‌గల సీఐ శ్రీనివాస్ మోర్తాడ్ ఎస్సై అనిల్‌రెడ్డిలను టార్గెట్ చేస్తూ ప్రశాంత్‌రెడ్డి వారి పేర్లను తన డైరీలో రాస్తున్నాడని బెదిరించడాన్ని నా యకులు తీవ్రంగా పరిగణించారు. అధికారంలో ఉన్నప్పుడు హత్యలు చేసిన యువకుడిని వెంట తిప్పుకొని అమాయక యువకుల్ని గంజాయి కేసులో ఇరికించిన కేసులో ఘనత వారిదన్నారు. కాంగ్రెస్ పార్టీపై తమ నాయకుడు ముత్యాల సునీల్‌కుమార్‌పై అడ్డగోలుగా మాట్లాడితే ఊరుకునేది లేదనివారన్నారు. అధికారంలో కోల్పోయిన ప్రశాంత్‌రెడ్డి అహంకారంతో ప్రవర్తిస్తున్నారని రాష్ట్రంలో ఉన్నది ప్రజల ప్రభుత్వామని, దొరల ప్రభుత్వం కాదని, తెలుసుకోవాలన్నారు. ఎమ్మెల్యే పోలీసు అధికారులపై చేసిన ఆరోపణలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో పాలెం నర్సయ్య, జక్కం అశోక్, కుందారపు శ్రీనివాస్, మహమ్మద్ యూనిఫ్, రవి, తదితరులు పాల్గొన్నారు.

మోర్తాడ్‌లో బైపాస్ రోడ్డు రద్దు చేయాలని రైతుల ధర్నా



మోర్తాడ్‌లో రహదారిపై ధర్నా చేస్తున్న రైతులు

మోర్తాడ్, మార్చి7: మండల కేంద్రంలోని జాతీయ రహదారిపై గురువారం రైతులు భారీ ధర్నా నిర్వహించారు. 63వ జాతీయరహదారిపై బైపాస్ రోడ్డు మంజూరును రద్దు చేయాలని రైతులు ఆందోళన నిర్వహించారు. ఈ ధర్నాలో రైతులు మాట్లాడుతూ గతంలో సర్వే చేసే విధంగా జాతీయ రహదారి పై నుంచి రోడ్డు వెడల్పు పను లు చేయాలని రైతులు అన్నారు. బైపాస్ రోడ్డు వల్ల విలువైన భూములు, తోటలు కోల్పతామని రైతులు ఆరోపించారు. గతంలో వరదకాలువ నిర్మాణానికి రైల్వేలైన్ నిర్మాణానికి విలువైన భూములు కోల్పోయామని, మళ్ళీ ఇప్పుడు బైపాస్ రోడ్డుకు భూములు ఇవ్వలేమని రైతులు ఖరకండిగా తేల్చిచెప్పారు. ఈ ధర్నాలో చేస్తున్న విషయం తెలిసి తహసీల్దార్ సత్యనారాయణ కూడా అక్కడికి చేరు కొని రైతులు చేస్తున్న ధర్నా వల్ల సమస్యల పరిష్కారం కోసం ఉన్నతాధికారులకు వివరిస్తామని సత్యనారాయణ రైతులతో అన్నారు.ఎస్సై అనిల్‌రెడ్డి తమ సిబ్బందితో ఎలాంటి అ వాంఛనీయ సంఘటనలు జరుగకుండా చూశారు. తహసీల్దార్‌ఇచ్చిన హామీ మేరకు రైతులు ఆందోళన విరమించాలని ఎస్సై కోరడంతో రైతులు ధర్నాను విరమించారు. రైతులు,గ్రామస్థులున్నారు.

ఓటరు నమోదుపై అవగాహన

ముప్కాల్, మార్చి7: 18ఏళ్లు నిండిన ప్రతీఒక్కరు తమ ఓటు హక్కును నమోదు చేసుకోవాలని డిప్యూటీ తహసీల్దార్ వినోద్ అన్నారు. గురువారం బాల్కొండ మండల కేంద్రంలోని మహిళ సమాఖ్య కార్యాలయంలో మహిళ సంఘా సభ్యులకు, వీవోఏలకు ఓటరు నమోదు గురించి ఓటర్ హెల్ప్‌లైన్‌పై ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఓటరు నమోదు కార్యక్రమాన్ని తమ మొబైల్ లో ఏ విధంగా నమోదు చేసే విధానాన్ని వారికి వివరించారు. ఈ కార్యక్రమంలో మహిళ సంఘాల సభ్యులు, సమాఖ్య సంఘాల అధ్యక్షులు, సీసీలు, మహిళలు, పాల్గొన్నారు.

శెట్‌పల్లిలో బాధితుడికి రూ.లక్ష ఎల్‌వోసీ అందజేత

మోర్తాడ్, మార్చి7: మండలంలోని శెట్‌పల్లి గ్రామానికి చెందిన చిన్న గంగారాంకు వైద్యఖర్చుల కోసం బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీ ముత్యాల సునీల్‌కుమార్‌రెడ్డి రూ.లక్ష 50వేల ఎల్‌వోసీనీ బాధితుడి కుటుంబసభ్యులకు అందజేశారు. గంగారాం అనారోగ్యంతో నిమ్స్ ఆసుపత్రిలో చేరారు. అధికంగా డబ్బు ఖర్చు కావడంతో ఆర్థిక సహాయం కోసం ముత్యాల సునీల్‌కుమార్‌ను ఆశ్రయించారు. దీంతో ఆయన సీఎం సహాయ నిధి నుంచి రూ.లక్ష 50వేల ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా కుటుంబసభ్యులు ముత్యాల సునీల్‌కుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

అదనపు తరగతి గదులు ప్రారంభం

మెండోర, మార్చి7: మండలంలో సోన్‌పేట్ గ్రామంలో గురువారం అదనపు తరగతి గదుల ను ఎంపీపీ సుకన్య కమలాకర్, తహసీల్దార్ సంతోష్, ఎంపీడీవో వనజతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీపీ నిధుల తో నిర్మించిన అదనపు తరగతి గదులు మహిళ సంఘ భవనానికి మరమ్మతు పనులు పూర్తి కావడంతో ప్రారంభిం చారు. ఈకార్యక్రమంలో ఎంపీవో సాయి లు, ఎంఈవో రాజేశ్వర్, ఏపీఎం విక్రంయ, కోఆప్షన్ సభ్యుడు బాబా, పాఠశాల ఉపాధ్యాయ బృందం, మహిళ సంఘ సభ్యులు పాల్గొన్నారు.

కుటుంబ సభ్యులకు వృద్ధురాలి అప్పగింత

కోటగిరి,మార్చి7: పొతంగల్ మండల కేంద్రానికి చెందిన మేత్రి పోచవ్వను గురువారం పోలీసులు కుటుంబ సభ్యులకు అప్పగించారు. 10రోజుల క్రితం పోచవ్వ అదృశ్యమైంది. జుక్కల్ మండలంలోని కౌలాస్‌లో ఉన్నట్లు గుర్తించి అక్కడి వారు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు పోచవ్వను కోటగిరి పోలీస్ స్టేషన్‌కు తీసుకువచ్చి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

నీటి కుంటలో పడి ఒకరి మృతి

డిచ్‌పల్లి, మార్చి 7: డిచ్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని నడిపల్లి తాండ చెరువులో పడి మాధవనగర్ కు చెందిన షేక్ అర్షద్(20) మృతి చెందినట్లు ఎస్సై మహేశ్ తెలిపారు. మృతుని తండ్రి షాదుల్ల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నమని శవాన్ని పంచనామా చేసి పోస్టుమార్టంకు తరలించమన్నారు.

రెండు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

జక్రాన్‌పల్లి, మార్చి7: మండలంలో ప్రభుత్వ అనుమతి తేలకుండా అక్రమంగా ఇసుకతను తరలి స్తున్న రెండు ఇసుక ట్రాక్టర్‌లు పట్టుకున్నట్టు ఎస్సై సీహెచ్.తిరుపతి గురువారం తెలిపారు. అను మతి, వే బిల్లులు అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్‌లను పట్టుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించామన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

మొరం వాహనం పట్టివేత

ముప్కాల్, మార్చి7: బాల్కొండ మండల కేంద్రంలోని అక్రమంగా తరలిస్తున్న మొరం టిప్పర్‌ను పట్టుకున్నట్టు ఎస్సై గోపి తెలిపారు. మంగళవారం రాత్రి నిబంధనలకు విరుద్ధంగా ఏలాంటి అనుమతులు లేకుండా తరలిస్తున్న వాహనాన్ని పెట్రోలింగ్ చేస్తున్న ఎఎస్సై శంకర్ పట్టుకుని స్టేషన్‌కు తరలించారు. పట్టుకున్న వాహనాన్ని విచారణ అనంతరం మైనింగ్ జూయాలజి అధికారులకు అప్పగించినట్టు ఎస్సై గోపి తెలిపారు. నిబంధనలకు ప్రకృతి సంపదను అక్రమంగా తరలించిన కేసులు నమోదు చేస్తామని ఆయన హెచ్చరించారు.

బీబీపూర్ తండాలో పన్నుల వసూళ్లపై స్పెషల్ డ్రైవ్

డిచ్‌పల్లి, మార్చి 7: మండలంలోని బీబీపూర్ తండాలో గురువారం పన్నుల వసూళ్లపై గ్రామ ప్రత్యేక అధికారి శ్రీనివాస్ గౌడ్ ఆదేశాల మేరకు స్పెషల్ డ్రైవ్ నిర్వహించినట్లు నడిపల్లి పంచాయతీ ఈవో నిట్టు కిషన్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. తండాలో ఒకే రోజు గ్రామంలో 50శాతం పన్నులు వసూళ్లు చేశామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు ముల్తాన్‌బీ, శిల్ప, శ్రీవాణి, జయశ్రీ, స్రవంతి, పాల్గొన్నారు.

రైలు ప్రమాదంలో వ్యక్తి మృతి

ఇందల్‌వాయి,మార్చి 7 :మండల కేంద్రంలోని రైల్వేగేట్ సమీపంలో రైలు ఢీ కొనడంతో ఆంధ్ర ప్రదేశ్ ప్రకాశం జిల్లాకు చెందిన దేవాండ్ల శ్రీనూ (43)అక్కడి కక్కడే మృతి చెందాడు. శ్రీనూ గత నెలలో మేస్త్రీ పనులు చేసుకునేందుకు ఇందల్ వాయికి వచ్చాడని అతను అనా రోగ్యం బారిన పడడంతో గురువారం మం డల కేం ద్రంలోని రైల్వేగేట్ సమీపంలో పట్టాలపైకి వెళ్లి ఆత్మహత్య చేసుకున్నాట్లు తెలిసింది. రైల్వే పోలీసులు కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పురుషులతో సమానంగా మహిళలు ఎదగాలి

● జడ్పీటీసీ మేక విజయ సంతోష్

రెంజల్,మార్చి7: నేటి సమాజంలో మహిళలు అత్యున్నత స్థాయికి ఎదుగుతున్నారని పురుషులతో సమానంగా మహిళలు అన్ని రంగాల్లో ఉన్నారని జడ్పీటీసీ మేక విజయ సంతోష్ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా గురువారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ప్రమీల రాణి ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కార్యకర్తలకు ఘనంగా సన్మానించారు. అనంతరం గర్భిణీ స్త్రీలకు శ్రీమంతాలను చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నేటి సమాజంలో మహిళా దినోత్సవం ప్రాముఖ్యత ప్రపంచంలోని మహిళలు సాధించిన విషయాలను వివరించారు. ఈ కార్యక్రమంలో సూపరిండెంట్ శ్రీనివాస్, ఎంఈవో గణేష్ రావు, ఆరోగ్య విస్తీర్ణాధికారి రవీందర్, అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ సునీత

కోటగిరి,మార్చి7: ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని కోటగిరి తహసీల్దార్ సునీత సూచించారు. కోటగిరి మండల సమాఖ్య కార్యాలయంలో గురువారం కొత్త ఓటరు నమోదు, ఓటుహక్కు ప్రాధాన్యతపై ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలకు ముగ్గుల పోటీలు, మెహందీ పోటీలు నిర్వహించారు. మొదటి బహుమతిని అశ్విని(పొతంగల్ యువ సంఘం), రెండో బహుమతి శ్రావణి(కోటగిరి యువ సంఘం)లు గెలుపొందారు. విజేతలకు తహసీల్దార్ సునీత బహుమతులను ప్రధానం చేశారు.ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటుహక్కు వజ్రాయుధం లాంటిందని ఆమె పేర్కొన్నారు. ఓటుహక్కును సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల సమాఖ్య అధ్యక్షురాలు రజిని, ఏపీఎం బస్వంత్, సిబ్బంది సాయిబాబా, రమా, గంగారాం, సుజాత, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

బకాయి వేతనాలను వెంటనే చెల్లించాలి

పెద్దబజార్,మార్చి 7: వైద్య ఆరోగ్యశాఖలో పని చేస్తున్న ఉద్యోగులు ఎన్ఎంహెచ్, ఎంఎన్‌హెచ్‌పీ బకాయివేతనాలను వెంటనే చెల్లించాలని యూనియన్ జిల్లా అధ్యక్షుడు షాదుల్లా డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని డీఎంహెచ్‌వో కార్యాలయంలో డీఎంహెచ్‌వో డాక్టర్ సుదర్శనంకు గురువారం వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ చాల కాలంగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లిన నేషనల్ హెల్త్ మిషన్ పరిధిలో పదివేల మంది ఉద్యోగులు పని చేస్తున్నారన్నారు. వీరు అత్యధికులకు రాష్ట్ర ప్రభుత్వం పీఆర్‌సీ ప్రకారం జీతభత్యాలను చెల్లించడం లేదన్నారు. గతంలో జీవోనంబర్ 510ద్వారా సుమారు పది వేల మంది వరకు డాక్టర్లు, స్టాఫ్‌నర్సులు, ల్యాబ్‌టెక్నిషన్లు, ఫార్మసిస్టులు, ఏఎన్ఎంలు, తదితరులకు బేసిక్ ప్రకారం వేతనాలు నిర్ణయించి చెల్లిస్తున్నారన్నారు. వెంటనే జీవో ప్రకారం సమానపనికి సమానవేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూనాయకులు నూర్జహాన్, తదితరులు పాల్గొన్నారు.

పదో తరగతి పరీక్షలకు సర్వం సిద్ధం



కేజీబీవీ పాఠశాలలో ప్రీఫైనల్ పరీక్షలను పరిశీలిస్తున్న డీఈవో దుర్గాప్రసాద్

ఇందల్‌వాయి,మార్చి7: ఈనెల 18వ తేదీ నుంచి జరుగనున్న పదో తరగతి పరీక్షలకు సర్వం సిద్ధం చేశామని జిల్లా విద్యాధికారి ఎన్‌వి. దుర్గాప్రసాద్ అన్నారు. గురువారం ఆయన మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో కొనసాగుతున్న పదో తరగతి ప్రీఫైనల్ పరీక్షలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడుతూ పదోతరగతి రాసే విద్యార్థులు ఆందోళనకు గురి కావొద్దని చక్కగా చదువుకుని పరీక్షలకు సిద్ధం కావాలని సూచించారు. పాఠశాల ఉపాధ్యాయులతో మాట్లాడి ఏర్పాట్ల గురించి అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు ఎటు వంటి ఇబ్బందులు ఉండకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని తెలిపారు. ఆయన వెంట పాఠశాల ప్రిన్సిపల్ వర్ష, సిబ్బంది, ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.

ప్రజా పాలన కేంద్రం సందర్శన



కమ్మర్‌పల్లి ప్రజాపాలన కేంద్రంలో నమోదును పరిశీలిస్తున్న అడిషనల్ కలెక్టర్

కమ్మర్‌పల్లి,మార్చి7: కమ్మర్‌పల్లి మండలకేంద్రంలో ఏర్పాటు చేసిన ప్రజాపాలన కేంద్రాన్ని గురువారం సాయంత్రం అడిషనల్ కలెక్టర్(లోకల్ బాడి)అంకిత్ సందర్శించి పరిశీలించారు.ప్రజాపాలన దరఖాస్తుల సవరణ నమోదు కార్యక్రమాన్ని పరిశీలించి ఆపరేటర్లకు సూచనలు చేశారు.అయితే మండల పరిషత్ కార్యాలయంలో మూడు కౌంటర్లు ఏర్పాటు చేయడం, కేంద్రానికి వచ్చిన లబ్ధిదారులకు కూర్చోవడానికి సదుపాయాలు కల్పించడం పట్ల ఆయన సంతృప్తిని వ్యక్తంచేశారు. ఎంపీడీవో రాజ శ్రీనివాస్, జూనియర్ అసిస్టెంట్ రాధిక, కంప్యూటర్ ఆపరేటర్లు సంతోష్, రాజేష్ ఉన్నారు.

నీతి, న్యాయం, ధర్మం ఉన్న చోటే సుభిక్షం

● మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి



కారేగాంలో మాట్లాడుతున్న మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి

కోటగిరి,మార్చి7: నీతి, న్యాయం, ధర్మం ఉన్న చోటే సుభిక్షంగా ఉంటుందని మాజీ స్పీకర్, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. పొతంగల్ మండలంలోని కారేగాం గ్రామంలో గురువారం ఆయన పర్యటించారు. కారేగాం గ్రామంలో బీఆర్ఎస్ కార్యకర్త గంగారాం నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇంటిని ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం కారేగాం మహ దేవుని ఆలయంలో కొనసాగుతున్న అఖండ శివ నామ సప్తాహలో ఆయన పాల్గొన్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రతీ ఒక్కరు దేవుడిని పూజించాలని కోరారు. ఆలయాలు ధర్మానికి సంకేతాలని, న్యాయానికి సూచనలు లాంటివని పేర్కొన్నారు. ధర్మం ఉన్న చోటే సుభిక్షంగా ఉంటుందని, లేనిచోట అశాంతి, కరువు కాటకాలు విలయ తాండవం చేస్తామయన్నారు. సమాజంలో ప్రతి ఒక్కరు భక్తి మార్గాన్ని అలవర్చుకోవాలని తద్వారా మానసిక ప్రశాంత లభిస్తుందని పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయంలో నియోజకవర్గంలో దేవాలయాల అభివృద్ధికి సుమారు రూ.500కోట్లు ఖర్చు చేసినట్లు గుర్తు చేశారు. మహ దేవుని ఆలయానికి 50లక్షలతో పాటు 45లక్షలతో కల్యాణ మండపం కోసం నిధులు మంజూరు చేశానన్నారు. ఈ కార్యక్రమంలో మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు ఏజాజ్‌ఖాన్, మాజీ ఏఎంసీ చైర్మన్ హంగర్గ గంగాధర్, మాజీ సర్పంచ్ జ్యోతి, బాన్సువాడ నియోజకవర్గ నాయకులు పోచారం సురేందర్ రెడ్డి, రాంబాబు, షజీ, విఠల్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం : సునీల్



జీరో బిల్లును చూయిస్తున్న సునీల్ కుమార్

ఏర్గట్ల,మార్చి7:ప్రజల సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తోందని బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ముత్యాల సునీల్ కుమార్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని బస్టాండ్ వద్ద కాంగ్రెస్ నాయకులు, మహిళలతో కలిసి గృహజ్యోతి జీరో కరెంట్ బిల్లు, రూ.500 లకు గ్యాస్ అమలుపై హర్షం వ్యక్తం చేస్తూ సీఎం రేవంత్‌రెడ్డి చిత్ర పటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ పేదల పార్టీ అని, అన్ని వర్గాల అభ్యున్నతికి కృషి చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పార్టీ ఉపాధ్యక్షుడు శివన్నోల్ల శివకుమార్, మండలాధ్యక్షుడు సోమ దేవ రెడ్డి, ఆడెపు గంగాప్రసాద్, గడ్డం జీవన్, రవిరెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

మహిళలను పట్టిపీడిస్తున్న వ్యాధి క్యాన్సర్

● డాక్టర్ ప్రతిమారాజ్



కేక్ కట్ చేస్తున్న డాక్టర్ ప్రతిమారాజ్

పెద్దబజార్,మార్చి7: మన దేశంలో ప్రస్తుతం మహిళలను పట్టిపీ డీస్తున్న వ్యాధి గర్భశయ క్యాన్సర్ అని ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ప్రతిమారాజ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో అంతర్జాతీయ మహిళ దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం హెచ్‌పీవీ వ్యాక్సిన్ క్యాంపెనింగ్ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా కేక్‌కట్ చేశారు. ఆమె మాట్లాడుతూ.. మహిళలు అన్ని రంగాల్లో దూసుక పోతున్నారని, ఆకాశంలో సగం అవనీమీద సగం అన్నిట్లో సగం సగం ఉన్నామని, ఆరోగ్యంలో మాత్రం వంద శాతం మెరుగుగ్గా ఉన్నారని అన్నారు. ఒక మహిళ ఆరోగ్యంగా ఉంటే ఆకుటుంబం మొత్తం ఆరోగ్యంగా ఉంటుందన్నారు. ఈ వ్యాక్సినేషన్ డ్రైవ్‌లో తొమ్మిది సంవత్సరాల నుంచి 45వయసు గల వారు ఈ వ్యాక్సిన్ తీసుకోవచ్చన్నారు. దీని వల్ల సర్వేకల్ క్యాన్సర్ అనగా గర్భాశయ ముఖద్వారా క్యాన్సర్‌ను నివారించవచ్చన్నారు. క్యాన్సర్‌కు ప్రోటెక్షన్‌గా ఇలాంటి వ్యాక్సిన్ ఉందని ఎవరికి తెలియదని అన్నారు. దీని వల్ల ప్రజలకు అవగాహన కల్పించిన వారిమవుతామని అన్నారు. ఈ వ్యాక్సిన్ తక్కువ ధరకు అందించిన వారికి ఆమె కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు రమ్య, సాధన, నర్సింగ్ సూపరింటెండెంట్ తదితరులు పాల్గొన్నారు.

● మెడికవర్ ఆస్పత్రిలో మహిళా దినోత్సవం

ముందస్తు జాగ్రత్తలతో గర్భశయ వ్యాధిని నివారించవచ్చని మెడికవర్ ఆస్పత్రి గైనికాలజిస్టు డాక్టర్ సుష్మానాగసూరి అన్నారు. గురువారం అంతర్జాతీయ మహిళ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆస్పత్రిలో కార్యక్రమం నిర్వహించారు. రుతుస్రవ సమయంలో పరిశు భ్రత జాగ్రత్తలు పాటించకపోవడం వల్లనే గర్భశయ వ్యాధి వస్తుందని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళల సంరక్షణ కోసం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు. మహిళల సంరక్షణకు ప్రత్యేక నిధులు కేటాయించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ యజ్ఞ, ఇన్‌చార్జీ స్వామి, మేనేజర్ వినయ్, తదితరులు పాల్గొన్నారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

కోటగిరి,మార్చి7: పొతంగల్ మండలంలోని హంగర్గ ఫారంలోని ఓ రేకుల షెడ్డులో బుధవారం రాత్రి 5క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం పట్టుకున్నట్లు ఎస్ఐ సందీప్ తెలిపారు. గ్రామంలో పీడీఎస్ బియ్యం అక్రమంగా నిల్వ ఉంచారన్న సమాచారం మేరకు దాడి చేశామన్నారు. 5క్వింటాళ్ల బియ్యాన్ని స్టేషన్‌కు తరలించి సివిల్ సప్లై అధికారులకు సమాచారం అందించామన్నారు. సివిల్ సప్లై డీటీ నిఖిల్ రాజ్ బియ్యాన్ని పరిశీలించి పీడీఎస్ బియ్యంగా నిర్ధారించడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సందీప్ తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

కోటగిరి,మార్చి7: పొతంగల్ మండల కేంద్రంలో గురువారం ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు ఎస్ఐ సందీప్ తెలిపారు. మంజీర నది నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారన్న సమాచారం మేరకు పొతంగల్ సమీపంలో ట్రాక్టర్‌ను పట్టుకుని స్టేషన్‌కు తరలించారు. అనుమతి లేకుండా ఇసుకను రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ సందీప్ తెలిపారు.

కొనసాగుతున్న ఇంటర్ పరీక్షలు

నిజామాబాద్‌అర్బన్,మార్చి 7:జిల్లా వ్యాప్తంగా కొనసాగుతున్న ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. జిల్లావ్యాప్తంగా 57పరీక్ష కేంద్రాల్లో గురువారం నిర్వహించిన గణితం-బి, జువాలజీ,హిస్టరీ పేపర్-2 పరీక్షకు మొత్తం 14,509 మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా 14,136మంది హాజరు కాగా 373 మంది గైర్హాజరు అయ్యారు. డీఈసీ కమిటీ 8, హెచ్‌పీసీ కమిటీ 6, ఫ్లయింగ్ సిట్టింగ్ స్క్వాడ్ బృందాలు 29, డీఐఈవో రఘురాజ్ 3 పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు. జిల్లా వ్యాప్తంగా ఎలాంటి మాస్‌కాపీయింగ్ కేసులు నమోదు కాలేదు.

ఘనంగా మహిళా దినోత్సవం



మహిళా ఉపాధ్యాయులను సన్మానించిన విద్యార్థులు

ఏర్గట్ల,మార్చి7:మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో గురువారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా పాఠశాలలోని మహిళ ఉపాధ్యాయులను విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులు సన్మానించారు. విద్యార్థులకు మహిళలు విద్య, సాంకేతిక, రాజకీయ, క్రీడా రంగాల్లో సాధించిన విజయాలను ఉపాధ్యాయులు వివరించారు. ఈకార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు బాలయ్య, గణేష్,లక్ష్మీ ప్రసన్న, అనిత, విద్యార్థులు పాల్గొన్నారు.

కోటగిరి: కోటగిరి ఉమ్మడి మండలంలో గురువారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పొతంగల్ మండల కేంద్రంలో పీఆర్టీయూ ఆధ్వర్యంలో మహిళా ఉపాధ్యాయులకు ఘనంగా సన్మానించారు. కోటగిరి మండల కేంద్రంలో కిడ్స్ ఆధ్వర్యంలో మహిళ ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు.ఈకార్యక్రమంలో పీఆర్టీయూ నాయకులు, కిడ్స్ నాయకులు పాల్గొన్నారు.

కమ్మర్‌పల్లి:అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మండల కేంద్రంలోని మిసిమి ఉన్నత పాఠశాలలో గురువారం మహిళ ఉపాధ్యాయులను విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ బాలి రవీందర్ మాట్లాడుతూ.. మహిళల విద్యావంతులైతే దేశానికి, వారివారి కుటుంబాలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. మహిళలు విద్య, సాంకేతిక, రాజకీయ, క్రీడాతదితర అన్ని రంగాల్లో విజయాలు సాధిస్తున్నారని ఇంకా ముందువరుసలో నడువాల్సిన అవసరం ఉందన్నారు.మహిళలు సాధించిన విజయాలను ఉపాధ్యాయులు విద్యార్థులకు విరించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రాజశ్రీ,శబానాజ్, మాధురి, శ్రీలక్ష్మీ, రజిత, కీర్తన, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని సాంఘిక సంక్షేమ గురుకుల మహిళ డిగ్రీ కళాశాలలో గురువారం మహిళ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ధనవేణి మాట్లాడుతూ అన్ని రంగాల్లో మహిళలు రాణించి రాజకీయంగా విద్య, వ్యవసాయ రంగంలో మహిళల ప్రాధాన్యత గురించి వివరించారు.ఈకార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ శరణ్య, విద్యార్థినులు పాల్గొన్నారు.

● క్షత్రీయ పాఠశాలలో

మండలంలోని చేపూర్‌లో గల క్షత్రీయ పాఠశాలలో అంతర్జాతీయ మహిళ దినోత్సవాన్ని పురస్కరించుకొని మహిళ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.ఈసందర్భంగా క్షత్రీయ విద్యాసంస్థల వైస్ చైర్మన్ అల్జాపూర్ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ప్రపంచంలో భారతదేశ మహిళలకు ఏనలేని గౌరవం ఉందని,సభ్యత సాంస్కృతాలకు ప్రతీకగా భారత మహిళలు అని అన్నారు. ఈ కార్యక్రమంలో అల్జాపూర్ గంగాధర్, విరేంద్ర, అక్షయ్, జయంత్, పరిక్షిత్, యశస్విని, లక్ష్మీనర్సింహ, విద్యార్థినిల తల్లులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

టీయూలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల ఆందోళన

డిచ్‌పల్లి,మార్చి 7: తెలంగాణ యూనివర్సిటీలో పనిచేస్తున్న 276మంది ఉద్యోగులు శ్రమ దోపిడీకి వ్యతిరేకంగా గురువారం 3వ రోజు మెయిన్ క్యాంపస్ స్వాగత తోరణం ఎదుట ధర్నా నిర్వహించారు. గతంలో అధికారులు ఇచ్చినహామీ ప్రకారం 2020 ప్రకారం జీతాలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగులు భూబాధితులు ఔట్ సోర్సింగ్‌లో పనిచేస్తున్న ప్రభుత్వం తక్కువ జీతం చెల్లింస్తోందని వాపోయారు. రెండురోజులుగా తాము ఆందోళన చేస్తున్న రిజిస్ట్రార్ ఎలాంటి హామీ ఇవ్వని కారణంగా నేడు కూడా సమ్మె చేస్తామని ఔట్ సోర్సింగ్ ప్రతిని ధులు పేర్కొన్నారు. గతంలో ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలని యూనియన్ అధ్యక్షుడు సురేశ్ డిమాండ్ చేశారు.

బీఆర్ఎస్ నాయకుడిపై కర్రలతో దాడి

● కాంగ్రెస్ నాయకులే చేశారని బీఆర్ఎస్ నాయకుల ఆరోపణ

ఏర్గట్ల, మార్చి 7: మండల కేంద్రానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ మండల మైనార్టీ అధ్యక్షుడు ఎండి జైనోద్దీన్‌పై బుధవారం రాత్రి కర్రలతో దాడి జరిగింది. ఈ ఘటనపై బీఆర్ఎస్ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ గురువారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఎస్సై మచ్చేందర్ రెడ్డిని కలిశారు. ఇది కచ్చితంగా కాంగ్రెస్ నాయకులు చేసిన పనేనని, దాడికి పాల్పడ్డ వారిపై కఠినంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎస్సై మాట్లాడుతూ దాడికి పాల్పడ్డ నలుగురిపై గత రాత్రే కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

మాక్లూర్, మార్చి7: మండలంలోని ముత్యంపల్లి గ్రామంలో గురువారం ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి ఆదేశాలతో ఎన్ఆర్ఈజీఎస్ పనులను ప్రారంభించినట్టు బీజేపీ జిల్లా కార్యదర్శి గంగోని సంతోష్ తెలిపారు. ఎన్ఆర్ఈజీఎస్ కింద రూ.3లక్షలతో సీసీరోడ్డు పనులను ప్రారంభించినట్టు ఆయన తెలిపారు.

ఎంపీ నిధులతో హైమాస్ట్ లైట్ ఏర్పాటు

కోటగిరి,మార్చి7: కోటగిరి మండల కేంద్రంలోని ఎన్టీఆర్ చౌరస్తాలో జహీరాబాద్ ఎంపీ బీబీపాటిల్ నిధులతో ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్‌ను మాజీ సర్పంచ్ లక్ష్మణ్ ప్రారంభించారు. మండల కేంద్రంలోని ఆసుపత్రి ప్రాంగణంలో ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. విగ్రహం వద్ద హైమాస్ట్ లైట్ ఏర్పాటు చేయాలని స్థానికులు ఎంపీని కోరగా ఆయన నిధులు మంజూరు చేశారు. సుమారు లక్షన్నర వ్యయంతో హైమాస్ట్ లైట్‌ను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ అభిమాన సంఘం నాయకులు ఉదయ్ భాస్కర్, సుబ్బారావు, చౌదరి తదితరులు పాల్గొన్నారు.

11న నడిపల్లిలో తైబజార్ వేలం

డిచ్‌పల్లి,మార్చి7:మండల కేంద్రంలోని నడిపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఈనెల 11న ఉదయం పదిన్నర గంటలకు తైబజార్ బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు గ్రామ ప్రత్యేక అధికారి శ్రీనివాస్ గౌడ్, కార్యదర్శి నిట్టు కిషన్‌రావు గురువారం తెలిపారు. తైబజారు వేలంలో పాల్గొనే వారు 50వేల రూపాయలు ముందుగా చెల్లించాలని డిపాజిట్ చెల్లించిన వారికి మాత్రమే వేలం పాటలో పాల్గొనవచ్చు అని, ఆసక్తి గల వారు గ్రామ పంచాయతీలో సంప్రదించాలని కోరారు.

చికెన్ ధరలు

రకం	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	రూ.140	రూ.215	రూ. 240
వెన్‌కాబ్(కిలో)	రూ.145	రూ.220	రూ. 250

బంగారం ధరలు

బిస్కెట్ (10 గ్రా.)	ఆర్నమెంట్(10 గ్రా.)	వెండి(10 గ్రా.)
రూ.65,200	రూ.60,100	రూ.760

సినిమా గైడ్ నిజామాబాద్

పీవీఆర్ మల్టీప్లెక్స్..

- స్క్రీన్-1 : శైతాన్ (హిందీ)(10.20,1.20, 4.20,7.20,10.20)
- స్క్రీన్-2 :గామి(10.00, 1.10, 4.20, 7.35, 10.45)
- స్క్రీన్-3 : భీమా (12.20,6.55) : దునే పార్ట్-2 (ఇంగ్లీష్) (3.25) :ఆపరేషన్ వాలెంటైన్ (10.00)
- స్క్రీన్-4 : బాబు (1.30) : రికార్డుబ్రేక్ (4.15) :మంజుమెల్‌బాయ్స్ (మళయాలం) (7.15) :ప్రేమలు (10.15)

ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్..

- స్క్రీన్-1 : భీమా (10.50,1.40, 4.30,7.30,10.30)
- స్క్రీన్-2 :ప్రేమలు (1.30,7.30) : రికార్డుబ్రేక్ (4.30)
- స్క్రీన్-3 :గామి(10.30, 1.30, 4.30, 7.30, 10.30)

- దేవి :ప్రేమలు (11.15, 2.15, 6.15, 9.15)
- లలితమహోల్ : భీమా (11.00, 2.15, 6.15 9.15,)
- నటరాజ్ : శైతాన్ (హిందీ)(11.15, 2.15, 6.15, 9.15)
- విజయ్ : గామి (11.15, 2.15, 6.15, 9.15)

- నిజామాబాద్ అర్బన్